క్లుప్తంగా

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన బుల్కాపురం రఘుపతిరెడ్డితో పాటు పలువురు నాయకులు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ కుండువాలు వేసి వారిని ఆహ్వానించారు. బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం దృష్ట్యా తాను పార్టీలో చేరినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



గురుస్వాములకు విరాళం అందజేస్తున్న రాజు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ శివారులో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మేకగూడ గ్రామానికి చెందిన మేకం రాజు ఆదివారం రూ.50వేల నగదు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మేకం రాజు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా అయ్యప్ప మాలను ధరిస్తున్నానని, స్వామివారి అనుగ్రహం ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. ఆలయ నిర్మాణానికి తనవంతు విరాళం అందించానని చెప్పారు. కార్యక్రమంలో గురుస్వామి గిరిషన్ నాయర్, సుదర్శన్‌గౌడ్, గ్రాంతిక్, కుర్వ యాదయ్య, సాయికుమార్, నరేశ్, గోపాల్ యాదవ్, మేకం మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

26న రాష్ట్ర క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మినీస్టేడియం ఆవరణలో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు రాష్ట్ర క్రీడాపోటీలకు మండల స్థాయిలో విద్యార్థుల ఎంపికను నిర్వహిస్తున్నామని ఎంఈఓ శంకర్‌రాథోడ్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, మోడల్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని 4వ తరగతి విద్యార్థులు అర్హులని తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 8 నుంచి 9 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే విద్యార్థులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్, పాఠశాల బోనోఫైడ్, 5 పాస్‌పోర్టుసైజ్ ఫొటోలను తీసుకురావాలని తెలిపారు. ఎత్తు, బరువు, 30మీటర్ల ఫ్లైయింగ్ షాట్, 80 మీటర్ల పరుగు, వర్టికల్ జంప్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామని వివరించారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

అన్నదాతలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

షాద్‌నగర్: అన్నదాతలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం కర్షకులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలం పాటు రైతులు పడుతున్న ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి కళ్లారా చూశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతలకు ఇచ్చిన మాటకు పూర్తిగా కట్టుబడి ఉండి రుణాల మాఫీకి నిర్ణయం తీసుకున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని, ధనరాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, ఇబ్రహీం, సురేశ్‌రెడ్డి, ఖదీర్, ముబారక్, సీతారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గోరు బంజారా సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

కేశంపేట: లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 1న రవీంద్రభారతిలో నిర్వహించే గోరు బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ సమన్వయకర్త, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్ కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో మాతండాలో మారాజ్యం, తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించాలనే డిమాండ్‌తో 1997వ సంవత్సరంలో ఎల్‌హెచ్‌పీఎస్‌ను ఏర్పాటు చేశామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బంజారా జాతి సంఘాల ప్రతినిధులతో గోరు బంజారా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి బంజారా ప్రజలు, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు భారీగా రావాలని కోరారు.

నిధులు రావు.. పనులు సాగవు!

రెండేళ్లుగా నిలిచిన రోడ్డు పనులు • గుంతలతో ప్రయాణికులకు తప్పని అవస్థలు • పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎన్కెపల్లి సమీపంలో అధ్వానంగా రోడ్డు



అర్ధంతరంగా నిలిచిన రోడ్డు పనులు

మొయినాబాద్‌రూరల్: అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా బాకారం రోడ్డు అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. దీంతో గుంతల రోడ్డుపై ప్రయాణం చేయాలంటే అవస్థలు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను రెండేళ్ల క్రితం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. కానీ సకాలంలో పనులు పూర్తి కాకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ఇబ్బందులను తీర్చాలని ఆయా గ్రామాల ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. మొయినాబాద్ మండలంలోని ఎన్కెపల్లి–బాకారం రోడ్డు విస్తరణ పనులకు అప్పటి ప్రభుత్వం 2022 మార్చిలో రూ.2.20 కోట్లు విడుదల చేసింది. మార్చి 13న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పనులను ప్రారంభించారు. అంతర్రాష్ట్ర రహదారి నుంచి ఎన్కెపల్లి మీదుగా బాకారం వరకు రోడ్డు పనులను చేపట్టాల్సి ఉంది. కానీ కొంతమేరకు రోడ్డు పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనాదారులు, ఆయా గ్రామాల ప్రజలు గుంతలరోడ్డుతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డును పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎన్కెపల్లి చౌరస్తా నుంచి ఎన్కెపల్లి, బాకారం వరకు రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలి. అప్పట్లో కాంట్రాక్టర్ జాతీయ రహదారి నుంచి ఎన్కెపల్లి వరకు పూర్తి చేశారు. అక్కడ నుంచి బాకారం వరకు రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో గుంతల రోడ్డుతో ప్రయాణికులు, వాహనాదారులు, పాదాచారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే పనులను పూర్తి చేసి ప్రజల రవాణా కష్టాలు తీర్చాలి.

–కొత్తపల్లి తిరుపతిరెడ్డి, బాకారం గ్రామస్తుడు

ప్రమాదాలు జరుగుతున్నాయి



ఎన్కెపల్లి, బాకారం రోడ్డును 30 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఇది అధ్వానంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 2022లో ఈ రోడ్డు పనులను ప్రారంభించి అర్ధంతరంగా నిలిపివేశారు. రెండేళ్లు దాటినా కాంట్రాక్టర్, అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి రోడ్డు పనులను పూర్తి చేయించాలి.

–పెంద్యాల శ్రీనివాస్, ఎన్కెపల్లి గ్రామస్తుడు

త్వరలోనే ప్రారంభిస్తాం



మండల పరిధిలోని ఎన్కెపల్లి–బాకారం రోడ్డు విస్తరణ పనులకు అప్పట్లో నిధులు 2.20 కోట్లు విడుదల చేయగా అవి సరిపోకపోవడంతో రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. మళ్లీ ప్రభుత్వం ద్వారా రూ.4కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు కోరాం. టెండర్లు రాగానే త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం

–విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

ఉద్యమ బంధాలు విడదీయలేనివి

రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్



బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో నాయకులు

షాద్‌నగర్: ఉద్యమ బంధాలు విడదీయలేనివని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. పట్టణంలోని శ్రీ సాయిబాలాజీ టౌన్ షిప్‌లో నివాసం ఉంటున్న రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ స్వగృహానికి ఆదివారం బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల పోరాటాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఉద్యమ సమయం నుంచి అందరి మధ్య విడదీయరాని బంధాలు నెలకొల్పబడ్డాయని పేర్కొన్నారు. ఈ ఉద్యమ బంధాలు ఏ నాటికి మరిచిపోలేనవన్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరాట ఉద్యమ జ్ఞాపకాలు అందరిలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల నిర్వాహకులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, తదితరులు

షాబాద్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో చాలా పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. అందులో వేలాదిగా కార్మికులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారని, సమస్యల పరిష్కారానికి యాజమాన్యాల దోపిడీకి వ్యతిరేకంగా ఏఐటీయూసీ పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. కంపెనీలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికు చట్టాలను అమలు చేయకపోతే యాజమాన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, షాబాద్ సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, నాయకులు రఘురాం, మధు, మహిళా సంఘం నాయకురాలు మంజుల, రాములు, జాంగిర్, మహమూద్ తదితరులు ఉన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



షాద్‌నగర్: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కేశంపేట: నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సంస్మరణ దివస్‌ను ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు హాజరై శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, మల్చలం మురళి, ఇస్నాతి శ్రీనివాస్, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, చెట్ల వెంకటేశ్, వంశీకృష్ణ, ప్యాట అశోక్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగిద్దాం

కేశంపేట: డాక్టర్ శ్యాంప్రసాద్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం డాక్టర్ శ్యాంప్రసాద్ బలిదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు డాక్టర్ శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంచుకోట నర్సింలు, శివాజీ, హరికృష్ణ, పాండురంగారెడ్డి, లక్ష్మణ్, రాజు, శ్రీను, రమేశ్, మహేశ్, వినయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిజైన్ లోపంతోనే ఇబ్బందులు

- అధికారుల నిర్లక్ష్యంతో రూ.16కోట్లు వృథా
- ఫ్లై ఓవర్ నిర్మాణంతోనే కొత్తూరులో ప్రమాదాల నివారణ
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కూడళ్లలో రాకపోకలను పునఃరుద్ధరించాలని సీఐ నర్సింహారావుకు సూచిస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: డిజైన్‌లో లోపంతోనే పట్టణంలో జాతీయ రహదారి వై జంక్షన్ కూడలిలో నిర్మించిన అండర్‌పాస్ వంతెనతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజలు, స్థానిక నాయకుల ఫిర్యాదు మేరకు ఆయన ఆదివారం అండర్‌పాస్ వంతెనను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అధికారులు అండర్‌పాస్ నిర్మాణానికి సరైన ప్రణాళికతో డిజైన్ రూపొందించకపోవడం, ఇంజినీరింగ్ వ్యవస్థ వైఫల్యంతో రూ.16కోట్లు వెచ్చించి నిర్మించిన అండర్‌పాస్ వృథాగా మారిందన్నారు. కేవలం అధికారులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అయినట్లు ఆరోపించారు. ప్రమాదాల నివారణలో భాగంగా నిర్మించిన అండర్‌పాస్ వంతెన కారణంగా భవిష్యత్‌లో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కూడళ్లలో జరిగే ప్రమాదాల నివారణకు తిమ్మాపూర్ పరిధిలోని పాపిరస్ పోర్ట్ నుంచి జేపీ దర్గా కూడలి వరకు ఫ్లైఓవర్ నిర్మించే విధంగా తాము కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. దీంతో పాటు ఎమ్మెల్యే చొరవతో మూసివేసిన పెంజర్ల, వై జంక్షన్ కూడలిలో పోలీసులు రాకపోకలను పునఃరుద్ధరించారు. దీంతో స్థానిక వ్యాపారులు, స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్, శ్రీను, గోవింద్‌నాయక్, ఆంజనేయులు, శ్రీనివాస్, కార్తీక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



షాబాద్: పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు



మొయినాబాద్ రూరల్: కనకమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

షాబాద్: షాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1994–1995 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మండల కేంద్రంలోని అన్‌మోల్ గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో చదువుకున్న రోజులను నెమరువేసుకున్నారు. మొత్తం 164 మంది విద్యార్థులకు గాను 131 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వీరస్వామిగౌడ్, దశరథ, కుమార్, లింగం, యాదగిరచారి, జనార్దన్, శ్రీనివాస్‌రావు, శ్రీదేవిలను ఘనంగా సన్మానించారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన విద్యార్థులు ఒకరినొకరూ పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవీందర్‌గౌడ్, చంద్రయ్య, గౌరిశంకర్, రవీందర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పద్మావతి, నీరజ, ప్రసన్న, సరిత, చంద్రలీలా, విశాల ఉన్నారు.

కనకమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని కనకమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–02 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని కనకమామిడి సమీపంలో గల సాయిగార్డెన్‌లో ఘనంగా జరుపుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు జాఫర్, రంగయ్య, నారాయణ, చెన్నయ్య, కిష్టయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు.

చేవెళ్ల: మండలంలోని ఆలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990–91లో పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 33 ఏళ్ల తరువాత ఒక చోట కలిసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేశ్‌గౌడ్, పనిరెడ్డి, సత్యనారాయణ, రాధ, విజయలక్ష్మి ఉన్నారు.

చేవెళ్ల పాఠశాలలో..

చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82 బ్యాచ్ పదో విద్యార్థులు ఆదివారం ఓ ఫాంమ్ హౌస్‌లో తమ 7వ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మొత్తం 45 మంది ఉన్న గ్రూప్ సభ్యులు గతంలో కలిసినప్పుడు పలు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకొని చేపడుతూ వస్తున్నారు. ఈ కలయికలో ఈ సేవా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో కూడా వారు చేపట్టే పలు సేవా కార్యక్రమాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంఘం గౌరవ అధ్యక్షుడు మల్గారి రమణారెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి పెంటయ్య, సభ్యులు సత్యనారాయణగౌడ్, భాగ్యలక్ష్మి, భారతీ, ఇందిర, ప్రభు, మాణిక్యరెడ్డి, బోజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, శంషోద్దీన్, విటల్‌రెడ్డి, బుచ్చిరాములు, సుధాకర్, తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: సమ్మేళనంలో ఆలూరు జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు



చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



కూడలిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కందుకూరు: అన్నదాతలకు రుణమాఫీ చేసి ఆర్థిక భరోసా కల్పించడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించడంపై ఆదివారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్ రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కృష్ణనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ఉత్సవాలు



బోనాల ఊరేగింపు

షాబాద్: మండలంలోని కుమ్మరిగూడ గ్రామంలో ఆదివారం బొడ్రాయి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు బొడ్రాయికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. బోనాల ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోసమోని కేతన, ఎంపీటీసీ దేశమొళ్ల అరుణ, నాయకులు రమేశ్‌యాదవ్, ఆంజనేయులు, నాయకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.